## బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగొద్దు

### వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్



సుబేదారి, మే 8: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు తప్పవని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ హెచ్చరించారు. మద్యం షాపుల ముందు మద్యం తాగుతూ ప్రజలకు ఇబ్బందులు కలుగజేస్తున్నట్లు పోలీసులకు ఫిర్యాదులు వస్తున్నాయని, ఇక నుంచి ఆయా ప్రాంతాల్లో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపడుతారని, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కేసు నమోదు చేస్తామని సీపీ హెచ్చరించారు.

**ఒక్కరోజే 221 మందిపై కేసులు..**

బుధవారం ఒక్క రోజే కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీసు యాక్ట్ కింద బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన 221మందిపై కేసు నమోదు చేసినట్లు సీపీ తెలిపారు. జనగామ డివిజన్‌లో 57, హనుమకొండ 42, స్టేషన్‌ఘన్‌పూర్ 40, కాజీపేట 24, వర్ధన్నపేట 24, నర్సంపేట 24, వరంగల్‌లో 10 చొప్పున కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. మద్యం షాపుల ముందు, పరిసరాల్లో ఎవరైనా మద్యం తాగితే షాప్ యజమానిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే వెంటనే 100కు కాల్ చేయాలని ప్రజలకు సూచించారు.

## ఈకేవైసీ కోసం డబ్బుల వసూలు

### రేషన్ డీలర్లపై చర్యలు తీసుకోవాలంటున్న లబ్ధిదారులు



బాధితుడు వెంకన్న

నల్లబెల్లి, మే 8: ఈకేవైసీ కోసం రేషన్ డీలర్లు డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. మండలకేంద్రానికి చెందిన కుదురుపాక వెంకన్న గురువారం బియ్యం తీసుకునేందుకు షాపు నంబర్-1 వద్దకు వెళ్లాడు. వెంకన్న భార్య పేరున ఈకేవైసీ చేయాల్సి ఉందని, ఇందుకు రూ. 100 చెల్లించాలని డీలర్ సూచించాడు. దీంతో ఈకేవైసీ ఉచితంగా చేయాలని వెంకన్న ప్రశ్నించాడు. డీలర్ నిరాకరించడంతో విధిలేక రూ. 100 చెల్లించి ఈకేవైసీ చేయించుకున్నట్లు వెంకన్న వాపోయాడు. ఈ విషయమై తహసీల్దార్ ముప్పు కృష్ణను వివరణ కోరగా.. రేషన్ షాపుల్లో ఫ్రీగానే ఈకేవైసీ చేయాలని డీలర్లను ఆదేశించారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



అధికారులతో మాట్లాడుతున్న నోడల్ ఆఫీసర్ పుష్పలత

## విశ్వ సుందరీమణుల రాక కోసం ఏర్పాట్లు

ఖిలావరంగల్, మే 8: కాకతీయ హెరిటేజ్ టూర్‌లో భాగంగా ఈ నెల 14న విశ్వ సుందరీమణులు చారిత్రక ఖిల్లాను సందర్శించనున్నారు. ఈ మేరకు కోటకు చేరే ప్రధాన రహదారులతోపాటు సందర్శన ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టారు. నోడల్ అధికారి పుష్పలత ఆధ్వర్యంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో టీజీటీడీసీ అధికారి నాథన్, నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, ఖిలావరంగల్ తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావు, టూరిజం అసిస్టెంట్ ప్రమోషన్ ఆఫీసర్ డాక్టర్ కుసుమ సూర్యకిరణ్, గైడ్ రవియాదవ్, సౌండ్ అండ్ లైట్స్ షో మేనేజర్ అజయ్, ఏఎస్ఐ కోట కోఆర్డినేటర్ కొత్తపెల్లి శ్రీకాంత్, గైడ్ రవియాదవ్ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సాంబరాజు చక్రపాణి

## వినియోగదారుల హక్కుల పరిరక్షణకు మూడంచెల న్యాయం

కాశీబుగ్గ, మే 8: వినియోగదారుల హక్కుల పరిరక్షణకు మూడంచెల న్యాయ వ్యవస్థ అత్యంత కీలకంగా పనిచేస్తున్నదని కేంద్ర ప్రభుత్వ వినియోగదారుల వ్యవహారాల ముఖ్య కార్యదర్శి నిధిఖరే అన్నారు. న్యూఢిల్లీలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ఆధ్వర్యంలో రెండు రోజుల ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. గురువారం ఆమెకు భారత వినియోగదారుల సమాఖ్య జాతీయ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. నూతన సవరణలు జరిగిన వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం-2019, లీగల్ మెట్రాలజీ రూల్స్ 2011పై గ్రామస్థాయిలో చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. అలాగే, వినియోగదారుల హక్కులకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో సాంబరాజు చక్రపాణి, ఎ.శివపార్వతి, డాక్టర్ అనంత శర్మ, ప్రీతి పాండ్యా పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలి

నెక్కొండ, మే 8: ఇందిరమ్మ కమిటీల జోక్యం లేకుండా నిరుపేదలైన అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు అందించాలని, రాజీవ్ యువ వికాస పథకాన్ని ఎలాంటి షరతులు లేకుండా, సిబిల్ స్కోర్‌తో సంబంధం లేకుండా అర్హులకు అందించాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ రాజ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ ఇళ్లపై ఆంక్షలు విధించి సగం మందిని అనర్హులుగా ప్రకటించారని, 60 గజాలు దాటితే అనర్హులుగా ప్రకటించడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం షరతులు లేకుండా అర్హులకు ఇండ్లు అందించాలన్నారు.

**బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ కమిషనర్**

నర్సంపేట, మే 8: నర్సంపేట నూతన మున్సిపల్ కమిషనర్‌గా కే భాస్కర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఉద్యోగులు భాస్కర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ సంపత్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

**సర్వేయర్ల శిక్షణ కోసం దరఖాస్తులు**

నల్లబెల్లి/సంగెం, మే 8: సర్వేయర్ల శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని నల్లబెల్లి, సంగెం తహసీల్దార్లు ముప్పు కృష్ణ, రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో కోరారు. భూ భారతి కార్యక్రమంలో భూములను సర్వే చేసేందుకు అనుభవం, లైసెన్స్ ఉన్న సర్వేయర్లు మండలకేంద్రంలోని మీసేవ సెంటర్‌లో శుక్రవారం నుంచి ఈ నెల 17వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన వారికి ఈ నెల 26 నుంచి జూన్ 26 వరకు ప్రత్యేక శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు.

**నర్సంపేట ఏసీపీగా పి.రవీందర్‌రెడ్డి**

నర్సంపేట, మే 8: నర్సంపేట ఏసీపీగా పున్నం రవీందర్‌రెడ్డిని నియమిస్తూ డీజీపీ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వి.కిరణ్‌కుమార్ హైదరాబాద్ డీజీపీ కార్యాలయానికి బదిలీ అయ్యారు.

## కురిసిన వర్షం.. తడిసిన ధాన్యం

### మార్కెట్‌లో తడిసిన ధాన్యం, మక్కలు

నర్సంపేట, మే 8: అకాల వర్షం రైతులకు తీవ్ర నష్టం కలిగించింది. గురువారం సాయంత్రం నర్సంపేటలో అకాల వర్షం కురిసింది. వరుస వర్షాలు అన్నదాతను కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి. చెడగొట్టువానతో పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులు ఆరబోసిన మక్కలు, ధాన్యం తడిసిపోయింది. వరదనీటిలో కొట్టుకుపోతున్న ధాన్యం, మక్కలను కాపాడుకునేందుకు రైతులు తీవ్ర ప్రయత్నాలు చేశారు. కళ్లెదుటే మక్కలు, ధాన్యం కొట్టుకుపోవడంతో రైతులు కన్నీరుమున్నీరుగా విలపించారు. అలాగే, నర్సంపేట మండలంలోని పలు గ్రామాల్లో రైతులు కల్లాలు, రహదారుల వెంట ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు, నాయకులు కోరుతున్నారు.



వర్షానికి నర్సంపేట మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యం



ఎగిసిపడుతున్న మంటలు

## ఎనుమాములలో చెలరేగిన మంటలు

### మిర్చి తొడిమెలకు నిప్పు పెట్టడంతో ఘటన

కాశీబుగ్గ, మే 8: వరంగల్ 14వ డివిజన్ ఎన్‌టీఆర్‌నగర్ సమీపంలోని మిర్చి కల్లాల సమీపంలో బుధవారం రాత్రి మిర్చి తొడిమెలకు వ్యాపారి నిప్పంటించారు. దీంతో అర్ధరాత్రి పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడంతోపాటు చుట్టూ పొగ, ఘాటు రావడంతో స్థానికులు ఇబ్బందులకు గురయ్యారు. ఒక్కసారిగా శ్వాశ ఆగిపోయినంత పనైందని స్థానికులు వాపోయారు. దీంతో పెద్ద ఎత్తున స్థానికులు ఘటనా స్థలానికి చేరుకొని మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా, ఘటనా స్థలానికి చేరుకొని రెండు గంటలపాటు నీళ్లతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. స్థానికులు మిర్చి వ్యాపారిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

**యువకుడి ఆత్మహత్య**

కరీమాబాద్, మే 8: ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మామునూరు ప్రాంతానికి చెందిన గూడెం రాజు(26) వృత్తి రీత్యా ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 14న తన తోబుట్టు పెండ్లి చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో అతడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



టీషర్ట్స్ బహూకరిస్తున్న న్యాయవాది రమేశ్‌యాదవ్

**క్రికెట్ టీం సభ్యులకు టీషర్ట్స్ పంపిణీ**

నెక్కొండ, మే 8: బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, న్యాయవాది కొమ్ము రమేశ్‌యాదవ్ పుట్టిన రోజు సందర్భంగా మండలకేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం క్రికెట్ టీం సభ్యులకు టీషర్ట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ చైర్మన్ కొమ్మారెడ్డి రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి తాటిపెల్లి శివకుమార్, పట్టణ అధ్యక్షుడు కొణిజేటి భిక్షపతి, నాయకులు రావుల భాస్కర్‌రెడ్డి, ఈదునూరి యాకయ్య, ఈదునూరి వెంకన్న, మాజీ ఉప సర్పంచ్ దేవనబోయిన వీరభద్రయ్య, నాయకులు తోట సాంబయ్య, దుగ్గి వెంకట్‌రెడ్డి, మాణిక్యం, శ్రీనివాస్, బీ రాజు, రాపాక విజేందర్ పాల్గొన్నారు.

**'సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి'**

నర్సంపేట, మే 8: ఈ నెల 20న నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడు శోభన్, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి పిలుపునిచ్చారు. మండలంలోని మహేశ్వరంలో గురువారం రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాల నాయకుల జిల్లా సదస్సు నిర్వహించారు.

**బాలల రక్షణ చట్టాలపై అవగాహన ఉండాలి**

గీసుగొండ, మే 8: బాలల రక్షణ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని చైల్డ్ హెల్ప్‌లైన్ ప్రతినిధి సుష్మ అన్నారు. మండలంలోని హర్జ్యాతండాలో గురువారం బాలరక్షాభవన్ ఆధ్వర్యంలో 1098, బాలల రక్షణ చట్టాలపై మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు, దివ్యాంగులు, శిశువులు, వృద్ధులకు సఖీ ఆధ్వర్యంలో సేవలు అందిస్తున్నామని చెప్పారు. బాధిత మహిళలకు కౌన్సెలింగ్ ఇచ్చి పోలీసు, న్యాయ, వసతి సహాయం చేయనున్నట్లు చెప్పారు. 1098, 181, 14567 టోల్‌ఫ్రీ నంబర్లకు ఫోన్ చేసి సాయం పొందాలన్నారు.

**డ్రంక్‌అండ్‌డ్రైవ్‌లో 3 రోజుల జైలుశిక్ష**

నెక్కొండ, మే 8: మండలకేంద్రంలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి మూడు రోజుల సాధారణ జైలు శిక్షతో పాటు వెయ్యి రూపాయల జరిమానాను నర్సంపేట స్పెషల్ మెజిస్ట్రేట్ సెకండ్ క్లాస్ కె.లక్ష్మీనారాయణ విధించినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. ఈ నెల 6న నెక్కొండలోని బ్రిడ్జి వద్ద తనిఖీలు నిర్వహించగా, పరీం రంజిత్ మద్యం తాగినట్లు గుర్తించారు. అతడిని కోర్టులో హాజరు పర్చగా జైలుశిక్ష, జరిమానా విధించారు.

**సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి: ఎస్సై**

సంగెం, మే 8: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఎల్.నరేశ్ అన్నారు. మండలంలోని తిమ్మాపురంలో గురువారం పోలీసు కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా కళా బృందం సభ్యులు ప్రజలకు నాటికలు, పాటలు, ప్రదర్శనల ద్వారా సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా ఎస్సై హాజరై మాట్లాడుతూ ఏటీఎం కార్డు పిన్ నంబర్ లేదా లావాదేవీల వివరాలు ఎవరికీ చెప్పొద్దన్నారు. సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.

**బాధిత కుటుంబానికి చల్లా పరామర్శ**

సంగెం, మే 8: మండలంలోని గవిచర్లకు చెందిన ఆగపాటి శ్రీనివాస్ గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గ్రామానికి చేరుకొని శ్రీనివాస్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ దొనికెల శ్రీనివాస్, మాజీ ఎంపీపీ దొనికెల మల్లయ్య, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

**పోలీసుల మృతదేహాలకు పోస్టుమార్టం**

వరంగల్ చౌరస్తా, మే 8: తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దులో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన ముగ్గురు పోలీసుల మృతదేహాలకు ఎంజీఎం మార్చురీలో గురువారం పోస్టుమార్టం నిర్వహించారు. పవన్‌కల్యాణ్ మృతదేహానికి వెంకటాపురం తహసీల్దార్ లక్ష్మీరాజయ్య, వడ్ల శ్రీధర్ మృతదేహానికి వాజేడు తహసీల్దార్ శ్రీరాముల శ్రీనివాస్, సందీప్ మృతదేహానికి వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్ ఆధ్వర్యంలో పంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహాలకు ఎంజీఎం ఫోరెన్సిక్ వైద్యుల బృందం శవ పరీక్షలు జరిపి పోలీసులకు అప్పగించారు. పోస్టుమార్టం పూర్తయిన వెంటనే మృతదేహాలను ప్రత్యేక అంబులెన్స్‌లో వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు తరలించారు.

## జల్ హీ అమృత్ శిక్షణకు హాజరైన కమిషనర్



మురుగునీటి శుద్ధీకరణ పద్ధతులను పరిశీలిస్తున్న కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే

వరంగల్, మే 8: సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ అర్బన్ గవర్నెన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్, ఆస్కీ సంయుక్తంగా హైదరాబాద్‌లో గురువారం నిర్వహించిన జల్ హీ శిక్షణకు కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే హాజరయ్యారు. రాష్ట్రంలోని పది మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు. జల్ హీ అమృత్ 2.0 లక్ష్యం, మురుగునీటిని శుద్ధి చేసి పునర్వినియోగం ద్వారా నీటి నిర్వహణ మెరుగుపర్చడం, శుద్ధి కార్మాగారాల నిర్వహణను సమర్థవంతంగా చేయడం తదితర అంశాలపై శిక్షణలో వివరించారు. అనంతరం హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లయ్ అండ్ సీవరేజ్ బోర్డు నిర్వహిస్తున్న మురుగు నీటి శుద్ధీకరణ పద్ధతులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

## మొరం తరలింపును అడ్డుకున్న కొండా వర్గీయులు

### ఎమ్మెల్యే అనుచరుడు తరలిస్తున్నాడని వాహనాల అడ్డగింత



వాహనాలను అడ్డుకుంటున్న కొండా వర్గీయులు

గీసుగొండ, మే 8: గీసుగొండ శివారులోని కాకతీయ ప్రధాన కాల్వ నుంచి మొరం తరలిస్తున్న భారీ వాహనాలను గురువారం కొండా వర్గీయులు వీరగోని రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో అడ్డుకున్నారు. ఎమ్మెల్యే రేవూరి అనుచరుడు చాడ కొమురారెడ్డి మొరం తరలించేందుకు అనుమతి తీసుకున్నారు. నిబంధనలు ఉల్లంఘించారంటూ కొండా వర్గీయులు వాహనాలను నిలిపివేశారు. ఎక్కడి తరలిస్తున్నారో అనుమతి పత్రంలో లేదని వాహనాలను అడ్డుకున్నారు. కెనాల్ ప్రాంతాన్ని రెవెన్యూ, పోలీసు అధికారులు వచ్చి పరిశీలించాలని కోరారు. ఎస్సై ప్రశాంత్‌బాబు ఘటనా స్థలానికి వచ్చి ఎస్సారెస్పీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. నిబంధనల విషయంలో స్పష్టత ఇవ్వాలని ఆయన అధికారులకు చెప్పారు. కాకతీయ ప్రధాన కాల్వ హద్దు ఎక్కడి వరకు ఉందో అధికారులు నిర్ణయించాలని, జరుగుతున్న మొరం దందాపై సంబంధిత శాఖ మంత్రి సమీక్షించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు.

## పేరుకే వేసవి శిక్షణ శిబిరం!



వేదికపై వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు

ఖిలావరంగల్, మే 08: గ్రేటర్ వరంగల్ 17వ డివిజన్ బొల్లికుంట జడ్పీహెచ్ఎస్‌లో వేసవి శిక్షణ శిబిరం నిర్వహణను అధికారులు గాలికొదిలేశారు. జిల్లాలోని 50 ఉన్నత పాఠశాలల్లో వేసవి శిక్షణ శిబిరాలను ప్రారంభించారు. రోజూ విద్యార్థులకు ఉదయం 8 నుంచి 11 గంటల వరకు యోగా, మెడిటేషన్, వాలీబాల్, కబడ్డీ, స్పోకెన్ ఇంగ్లిష్, మ్యాథ్స్, టెన్నీస్, క్రికెట్, చిత్రలేఖనం, సంగీతం తదిరత వాటిలో శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. బొల్లికుంటలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు వేసవి శిక్షణకు ధాన్యం కొనుగోలు కేంద్రం అడ్డంకిగా మారింది. మైదానంలో రైతులు ధాన్యం ఆరబోయడంతో విద్యార్థులు ఆడుకోవడానికి స్థలం లేదు. దీంతో విద్యార్థులు వేదికపై వాలీబాల్ ఆడుకొని తిరిగి వెళ్లిపోతున్నారు. హెచ్ఎం రవిని వివరణ కోరగా.. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తొలగించాలని సెంటర్ నిర్వాహకులను కోరగా పట్టించుకోవడం లేదని తెలిపారు.

## భారత్‌కు ధైర్యం.. మన సైన్యమే

### వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి



జాతీయ జెండాలతో సంఘీభావ ర్యాలీలో పాల్గొన్న వ్యాపారులు

కాశీబుగ్గ, మే 8: భారతదేశానికి ధైర్యం మన సైన్యమే అని వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్ రెడ్డి అన్నారు. ఉగ్రదాడులకు ప్రతీకారంగా భారత సైన్యం మంగళవారం రాత్రి పీవోకేలోని ఉగ్రవాదుల శిబిరాలపై దాడి చేసి హతమార్చడంతో హర్షం వ్యక్తం చేస్తూ వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ పరిధిలో గురువారం సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి సైనికులు చేసే సేవలు మరువలేనివన్నారు. భారత త్రివిధ సైనిక దళాల పరాక్రమాన్ని కొనియాడారు. సిందూర్ ఆపరేషన్‌తో భారత్ ఉగ్రమూకలకు బుద్ధి చెప్పి ప్రపంచానికి తెలియజేసిందన్నారు. ఐక్యరాజసమితిలో పరువు పోగొట్టుకున్న పాకిస్థాన్ ఆకలి కేకలతో అలమటిస్తున్న ఆ దేశ ప్రజలను పట్టించుకోకుండా ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్నదని విమర్శించారు. మన దేశ త్రివిధ దళాలల సైనికుల సామర్థ్యపు స్ఫూర్తిని, ధైర్యాన్ని, ఆత్మస్థైర్యాన్ని ఈ సందర్భంగా కొనియాడారు. ర్యాలీలో చాంబర్ ప్రధాన కార్యదర్శి మాడూరి వేదప్రకాశ్, చాంబర్ మాజీ అధ్యక్షుడు కటకం పెంటయ్య, దిడ్డి కుమారస్వామి, కోశాధికారి అల్లె సంపత్, సాగర్ల శ్రీనివాస్, వివిధ సెక్షన్ల అధ్యక్ష కార్యదర్శులు, అడ్తి, ఖరీదు వ్యాపారులు, కార్మికులు, రైతులు, మార్కెట్ కమిటీ ఉద్యోగులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిలో సీసీరోడ్డు నిర్మాణం

### దేశాయిపేటలో ఇద్దరిపై కేసు నమోదు



దేశాయిపేటలోని ప్రభుత్వ భూమిలో బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు

పోచమ్మమైదాన్, మే 8: వరంగల్ దేశాయిపేటలోని ప్రభుత్వ భూమిలో ఓ వెంచర్‌కు సంబంధించిన ఇద్దరు వ్యక్తులు దర్జాగా సీసీరోడ్డు నిర్మించారు. దీంతో వరంగల్ రెవెన్యూ అధికారులు గుర్తించి బోర్డు ఏర్పాటు చేశారు. అయినా దాన్ని వెంచర్ నిర్వాహకులు తొలగించారు. దీంతో రెవెన్యూ అధికారుల ఫిర్యాదు మేరకు ఇంతెజార్‌గంజ్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. దేశాయిపేట 61 సర్వే నంబర్‌లోని 9.10 గుంటల భూమిలో ఇదే ప్రాంతానికి చెందిన మందా అశోక్, జూలూరి నైనేష్ మోక్ష ఇన్‌ఫ్రాకాన్ పేరుతో వెంచర్ ఏర్పాటు చేశారు. పక్కనే ఉన్న 14 గుంటల (1200 చదరపు గజాలు) ప్రభుత్వ భూమిని ఆక్రమించి సీసీరోడ్డు నిర్మించారు. విషయం తెలుసుకున్న వరంగల్ తహసీల్దార్ ఎండీ ఇక్బాల్ సిబ్బందితో కలిసి దేశాయిపేటకు వెళ్లి పరిశీలించారు. అనంతరం బోర్డు ఏర్పాటు చేశారు. అశోక్, నైనేష్‌పై కేసు నమోదు చేయాలని ఇంతెజార్‌గంజ్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

## ఆయిల్‌పామ్ తోటల్లో సస్యరక్షణ చర్యలు పాటించాలి

గీసుగొండ, మే 8: ఆయిల్‌పామ్ తోటల్లో సస్యరక్షణ చర్యలు పాటించాలని వరంగల్ డివిజన్ ఉద్యాన శాఖ అధికారి ఎన్.తిరుపతి అన్నారు. మండలంలోని ఎలుకుర్తి హవేలీ గ్రామంలో గురువారం రాంచందర్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో నాయికోటి రవీందర్ సాగు చేసిన ఆయిల్‌పామ్ తోటలో రైతులకు సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్‌పామ్ గెలలు టన్నుకు రూ. 20 వేల ధర పలుకుతున్నట్లు చెప్పారు. వచ్చే ఆరు నెలల్లో ముందుగా వేసిన పంట చేతికి అందే అవకాశం ఉందన్నారు. ఆయిల్‌పామ్ గెలలను కంపెనీ వారే కొనుగోలు చేస్తారని చెప్పారు. ఫీల్డాఫీసర్ అనిల్‌జైన్, కంపెనీ ప్రతినిధులు శివ, రాజమౌళి, రైతులు వీరారెడ్డి, తిరుపతిరెడ్డి, ఇంద్రసేనారెడ్డి, రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేయర్ గుండు సుధారాణి

## ఆపరేటర్లు పనితీరు మెరుగుపర్చుకోవాలి: మేయర్

వరంగల్, మే 8: కంప్యూటర్ ఆపరేటర్లు పనితీరును మెరుగుపర్చుకోవాలని మేయర్ గుండు సుధారాణి సూచించారు. బల్దియా కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్లతో గురువారం సమీక్షించారు. బల్దియాలోని వివిధ సెక్షన్లలో విధులు నిర్వర్తిస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు కొత్త సాఫ్ట్‌వేర్ సాంకేతికతను అందిపుచ్చుకొని, దానికి అనుగుణంగా పనితీరు మార్చుకోవాలని మేయర్ సూచించారు. ఆపరేటర్లకు ఎలాంటి సెక్షన్ కేటాయించినా అంకితభావంతో పని చేయాలన్నారు. సమీక్షలో ఐటీ మేనేజర్ రమేశ్, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

## జూడో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా కైలాస్‌యాదవ్



కైలాస్‌యాదవ్

హనుమకొండ చౌరస్తా, మే 8: తెలంగాణ జూడో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఖిలావరంగల్ మధ్యకోటకు చెందిన బైరబోయిన కైలాస్‌యాదవ్ ఎన్నికయ్యారు. ఫిబ్రవరిలో హైదరాబాద్ నాంపల్లిలో జూడో అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలు నిర్వహించగా, అంతర్జాతీయ క్రీడా పోటీలు కొనసాగుతున్న నేపథ్యంలో ఫలితాలను నిలిపివేశారు. గురువారం తెలంగాణతో పాటు మరో 15 రాష్ట్రాల నూతన కమిటీ జాబితాను జూడో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అడ్మినిస్ట్రేటర్, అలహాబాద్ రిటైర్డ్ జడ్జి పంకజ్ సఖ్వీ ప్రకటించారు. తెలంగాణ జూడో అసోసియేషన్ నూతన కార్యవర్గంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పలువురు పదవులను దక్కించుకున్నారు. రాష్ట్ర జాయింట్ సెక్రటరీలుగా డీ సంతోష్, బీ సాయిరాంయాదవ్, టెక్నికల్ కమిటీ చైర్మన్‌గా సీహెచ్ రాము, టెక్నికల్ కమిటీ సెక్రటరీగా నాగరాజు ఎన్నికయ్యారు. వీరందరూ నాలుగేళ్లపాటు ఈ పదవిలో కొనసాగుతారన్నారు.

## 9 నుంచి క్రికెట్ వేసవి శిక్షణ శిబిరాలు



శ్రీనివాస్

హనుమకొండ చౌరస్తా, మే 8 : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సౌజన్యంతో వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 6 సెంటర్లలో ఈ నెల 9 నుంచి జూన్ 7వ తేదీ వరకు ఉచిత క్రికెట్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు. ప్రతి క్రికెట్ సెంటర్‌లో ఉదయం, సాయంత్రం జరిగే కోచింగ్‌లో పాల్గొనాలనుకునే క్రికెట్ క్రీడాకారులు ఈ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వరంగల్ (తోట రాము 9966559414)-కాకతీయ మెడికల్ కాలేజీ గ్రౌండ్ వరంగల్, మహబూబాబాద్(అజయ సారథి 9866479666) కాంక్రీట్ క్రీడా మైదానం మహబూబాబాద్, భూపాలపల్లి (సిరిమల్లె శ్రీనివాస్ 8897805683) సింగరేణి స్టేడియం భూపాలపల్లి, పరకాల (అభినవ వినయ్ 9666206662) ప్రభుత్వ జూనియర్ కాలేజీ గ్రౌండ్ పరకాల, ములుగు (సందీప్‌నేత్ర 9030130727) తంగేడు క్రీడా మైదానం ములుగు, జనగామ (దిలీప్ రెడ్డి 99590 00003) జిల్లాలోని యశ్వంతపూర్‌లోని సెజ్ పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అండర్ -14,16,19,23 విభాగాల్లో స్థానిక కోచింగ్ సెంటర్‌లో తమ పేరు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

**వడదెబ్బతో హమాలీ కార్మికుడి మృతి**



శ్రీనివాస్ (ఫైల్)

కాశీబుగ్గ, మే 8: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ పరిధిలోని మిర్చి యార్డులో వడదెబ్బతో హమాలీ మృతి చెందాడు. జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలంలోని సాగరం గ్రామానికి చెందిన శివరాత్రి శ్రీనివాస్(35) సుందరయ్య నగర్‌లో ఉంటూ మార్కెట్ పరిధిలోని గజేంద్ర ఎంటర్‌ప్రైజెస్‌లో పదేళ్లుగా హమాలీగా పని చేస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం మిర్చి బస్తాలు తీసుకెళ్తున్న క్రమంలో ఒక్కసారిగా కుప్ప కూలిపోయాడు. వెంటనే తోటి హమాలీలు అతడిని ప్రైవేట్ దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**పాస్‌పోర్ట్ పోయినది**

★నేను, బసికె విజయ్‌కుమార్ S/o బసికె రత్నం నా యొక్క పాస్‌పోర్ట్ 2025 ఏప్రిల్ 20న లేబర్ కాలనీ నుండి ఖిలా వరంగల్‌కు వెళుతుండగా దారిలో ఎక్కడో పడిపోయినది. నాపాస్‌పోర్ట్ నెం. J5092952 గల పాస్‌పోర్టు ఎవరికి అయిన దొరికితే నా ఫోన్ నెం. 9849776722 లలో సంప్రదించగలరని ప్రార్థన.
NTW-000

**CHANGE OF NAME**

I, MOHAMMED KHAJA MOINUDDIN S/o MOHAMMED ABDUL KHADER R/o H.No. 11-23-2007, LB Nagar, Near ZIA Masjid, Warangal, district,-506002, T.G. My name is Changed from MOHAMMED ABDUL KHAJA MOINUDDIN S/o MOHAMMED ABDUL KHADER to MOHAMMED KHAJA MOINUDDIN S/o MOHAMMED ABDUL KHADER for all purposes.

**గోదాం కావలెను**

★పెద్దవంగరలోని మన గ్రోమోర్ సెంటర్‌కు పర్మినెంట్ గోదాం కావలెను. 1500-2000 Sq.fts గలది పెద్దవంగర మేన్ రోడ్ పరిధిలో కావలెను. సంప్ర: 9121044072, 91001007590.
NTW-000

**CHANGE OF NAME**

★I, MOHAMMED MUJEEBUDDIN S/o MOHAMMED ANWARUDDIN R/o H.No.11-22-830/1, Madeena Street, L.B.Nagar, Warangal City & Dist., have changed my name from MOHAMMED ABDUL MUJEEB to MOHAMMED MUJEEBUDDIN S/o MOHAMMED ANWARUDDIN for all future Purposes.
NTW-17627

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

**CHANGE OF NAME**

★I, MAMIDALA ANNAPURNA (New Name) previously called MAMIDALA ANNAPOOORNA (Old Name), W/o MAMIDALA PRAKASH, R/o. H.No: 1-9-965, Postal colony, Near Adalath, Hanamkonda District,-5060002, T.G solemnly declare.
NTW-17628

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565